రామ్‌చరణ్

మైసూర్‌కు 'గేమ్ ఛేంజర్'

రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'గేమ్ ఛేంజర్'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. 'ఆర్‌ఆర్‌ఆర్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత రామ్‌చరణ్ నటిస్తున్న ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి. ఇటీవలే హైదరాబాద్‌లో ఓ షెడ్యూల్ పూర్తయింది. తాజా షెడ్యూల్‌ను ఈ నెల 23 నుంచి మైసూర్‌లో మొదలుపెట్టబోతున్నారు. ఇందులో చిత్ర ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక ఘట్టాలను తెరకెక్కించబోతున్నట్లు తెలిసింది. ఓ సాధారణ యువకుడు అసాధారణ నాయకుడిగా ఎదిగిన వైనాన్ని ఆవిష్కరిస్తూ చక్కటి సామాజిక సందేశంతో దర్శకుడు శంకర్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని చెబుతున్నారు. ఈ సినిమాలో తండ్రీకొడుకులుగా రామ్‌చరణ్ ద్విపాత్రాభినయంలో కనిపిస్తారు. కియారా అద్వాణీ, అంజలి, సముద్రఖని, ఎస్.జె.సూర్య, శ్రీకాంత్, సునీల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, సంభాషణలు: సాయిమాధవ్ బుర్రా.

మణికందన్, వెంకట్ బోయినపల్లి, వెంకటేష్, సంతోష్ నారాయణన్, శైలేష్ కొలను

సైంధవ్ నా మనసుకు దగ్గరైన సినిమా

'ప్రతి రోజు పాజిటివ్‌గా ఆలోచించడం అలవరచుకోండి. జీవితం చిన్నది. ప్రతి క్షణాన్నీ ఆస్వాదిస్తూ లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రయత్నించండి' అని విక్టరీ వెంకటేశ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'సైంధవ్'. తమిళనటుడు ఆర్య, బాలీవుడ్ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ, రుహానీ శర్మ, శ్రద్ధా శ్రీనాథ్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి శైలేశ్ కొలను దర్శకుడు. వెంకట్ బోయినపల్లి నిర్మాత. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 13న విడుదల కానుంది. ఈ చిత్రంలోని 'రాంగ్ యూసేజ్' అంటూ సాగే పాటను హైదరాబాద్ సీఎంఆర్ కాలేజీలోని విద్యార్థుల సమక్షంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ విద్యార్థులతో ముచ్చటించారు. '37 ఏండ్ల సినీ ప్రయాణం నాది. నా మొదటి సినిమాను మీ పేరెంట్స్ చూసుంటారు. అప్పుడు వాళ్లకు నా సినిమాలు నచ్చాయి. ఇప్పుడు మీకు కూడా నా సినిమాలు నచ్చడం ఆనందంగా ఉంది. 'సైంధవ్' నా 75వ సినిమా. నా మనసుకు దగ్గరైన సినిమా. నిర్మాత గ్రాండ్‌గా నిర్మించారు. దర్శకుడు శైలేష్ అద్భుతంగా తెరకెక్కించాడు. ఇదొక ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్. తప్పకుండా అందరికీ నచ్చుతుంది. ఈ రోజు 'రాంగ్ యూసేజ్..' సాంగ్‌ని విడుదల చేస్తున్నాం. సెల్‌ఫోన్‌నీ, డబ్బునీ ప్రేమిస్తూ మనకు మనం దూరమవుతున్నామని చెప్పే పాట ఇది. చంద్రబోస్ అర్థవంతంగా ఈ పాట రాశారు. సంతోశ్ నారాయణన్ స్వరపరిచిన ఈ పాటను నకాష్ అజీజ్ ఆలపించారు. మీరందరూ కచ్చితంగా వినాల్సిన పాట' అని చెప్పారు వెంకటేశ్. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు.

'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో..

'డీజే టిల్లు' చిత్రంతో యువతరానికి బాగా చేరువయ్యారు సిద్ధు జొన్నలగడ్డ. ఇప్పుడా చిత్రానికి సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్' తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఆయన తాజా చిత్రానికి బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహించబోతున్నారు. శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించనున్నారు. డిసెంబర్ మొదటి వారంలో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనుంది. కుటుంబ భావోద్వేగాలు, వినోదం కలబోసి తనదైన శైలి కథాంశంతో దర్శకుడు బొమ్మరిల్లు భాస్కర్ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని..సిద్ధు జొన్నలగడ్డ పాత్ర గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉంటుందని చెబుతున్నారు. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి.

సిద్ధు జొన్నలగడ్డ

నాని, మృణాల్ ఠాకూర్

ఓ నాన్న కథ

తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో నాని నటిస్తున్న 'హాయ్ నాన్న' సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలున్నాయి. 'దసరా' వంటి పూర్తి స్థాయి మాస్ సినిమా తర్వాత హీరో నాని ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకురావడం ఆసక్తిని పెంచుతున్నది. మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో బేబీ కియారా ఖన్నా కీలక పాత్రను పోషిస్తున్నది. శౌర్యువ్ దర్శకుడు. డిసెంబర్ 7న విడుదలకు సిద్ధమవుతున్నది. ట్రైలర్‌ను ఈ నెల 24న రిలీజ్ చేయబోతున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన కొత్త పోస్టర్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. తండ్రీకూతుళ్ల అనుబంధానికి దర్పణంలా హృదయాన్ని స్పృశించే భావోద్వేగాలతో ప్రేక్షకుల్లో మెప్పించే చిత్రమిదని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సానుజాన్ వర్గీస్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, నిర్మాణ సంస్థ: వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్, నిర్మాతలు: మోహన్ చెరుకూరి, డా॥ విజయేందర్ రెడ్డి తీగల.

మీనాక్షి చౌదరి

ఆయన నవ్వుతూ అందర్నీ నవ్విస్తుంటారు..

మామూలుగానే అందగత్తె. దానికితోడు కళ్లు మిరుమిట్లు గొలిపే వస్త్రధారణ. ఆ అందానికి ఆ జిగేలు తోడైతే.. ఏంటి? ఇదేదో షాపింగ్‌మాల్ యాడ్‌కి సంబంధించిన స్క్రిప్ట్ అనుకుంటున్నారా?.. మీనాక్షి చౌదరి ఇన్‌స్టాలోకెళ్లి ఆమె స్టిల్స్ చూస్తే ఇలాంటి ఎక్స్‌ప్రెషన్సే వస్తాయి. కళ్లు తిప్పుకోలేం. పాత సినిమాల్లో హీరోయిన్‌లా కొన్ని కొన్ని స్టిల్స్‌లో నిండుగా చీరకట్టుకున్న మీనాక్షి చౌదరిని చూస్తే గుండె బరువెక్కక మానదు. చేసింది తక్కువ సినిమాలే అయినా ఎక్కువమంది హృదయాలను కొల్లగొట్టేసింది మీనాక్షి. సంక్రాంతికి రానున్న 'గుంటూరుకారం'తో ఈ ముద్దుగుమ్మ స్టార్ హీరోయిన్‌గా అవతరించడం ఖాయమని పలువురు బలంగా నమ్ముతున్నారు. ఇటీవల తన ఇన్‌స్టాలో ఫ్యాన్స్‌తో సరదాగా చిట్‌చాట్ చేసిందీ అందాల భామ. మీకు చీరంటే ఇష్టమా? అనడిగితే– 'నాకు తెలిసి.. స్త్రీ అందాన్ని చీర ఆవిష్కరించినట్టు ఏ డ్రెస్సూ ఆవిష్కరించదు. నా ఆల్‌టైమ్ ఫేవరెట్ శారీ..' అంటూ బదులిచ్చింది మీనాక్షి. మహేశ్‌బాబుతో సినిమా చేస్తున్నారుకదా.. ఎలావుంది ఎక్స్‌పీరియన్స్ అనంటే ' ఆయన చాలా కూల్. సందర్భోచితంగా నవ్వించడంతో దిట్ట. అంతపెద్ద సూపర్‌స్టార్ అయ్యుండి కూడా డౌన్ టు ఎర్త్ పర్సన్. ఆయన నవ్వుతూ ఉంటారు.. అందర్నీ నవ్విస్తూ ఉంటారు. 'గుంటూరుకారం'లో ఆయనతో నాకు డ్యూయెట్లు కూడా ఉన్నాయి. ఎంజాయ్ చేస్తూ ఈ సినిమా చేస్తున్నాను' అంటూ చెప్పుకొచ్చింది మీనాక్షి చౌదరి.

ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ 'ఉషా పరిణయం'

నువ్వేకావాలి, మన్మథుడు, నువ్వు నాకు నచ్చావు వంటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్‌తో తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపును సంపాదించుకున్నారు సీనియర్ దర్శకుడు విజయ్ భాస్కర్. తాజాగా ఆయన 'ఉషా పరిణయం' పేరుతో ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీని తెరకెక్కించబోతున్నారు. 'లవ్ ఈజ్ బ్యూటీఫుల్' ఉపశీర్షిక. మంగళవారం ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు. క్రాఫ్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కనున్న ఈ చిత్రంలో శ్రీకమల్, తాన్వీ ఆకాంక్ష, సూర్య ప్రధాన పాత్రల్ని పోషించనున్నారు. అలీ, వెన్నెల కిషోర్, శివాజీ రాజా, ఆమని, సుధ, ఆనంద్ చక్రపాణి తదితరులు ఇతర పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి కెమెరా: సతీష్ ముత్యాల, సంగీతం: ఆర్.ఆర్.ధృవన్, దర్శకత్వం: కె.విజయ్ భాస్కర్.

విజయ్ భాస్కర్

సుడిగాలి సుధీర్, డాలీషా

ఇప్పటివరకు రాని కథ

సుడిగాలి సుధీర్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'కాలింగ్ సహస్ర'. అరుణ్ విక్కిరాలా దర్శకత్వంలో విజేష్ తయాల్, చిరంజీవి పమిడి, వెంకటేశ్వర్లు కాటూరి నిర్మిస్తున్నారు. డాలీషా కథానాయిక. డిసెంబర్ 1న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సుడిగాలి సుధీర్ మాట్లాడుతూ 'సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది. కథ, కథనాలు వైవిధ్యంగా ఉంటాయి. అనుక్షణం ఉత్కంఠను పంచుతూ సాగుతుంది. కొత్తదనానికి తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ పట్టం కడతారు. అదే రీతిలో ఈ సినిమాను ఆదరిస్తారనుకుంటున్నా' అన్నారు. ఇప్పటివరకు ఇండియన్ స్క్రీన్‌పై రానటువంటి కథ ఇదని దర్శకుడు అరుణ్ విక్కిరాలా తెలిపారు. ట్రైలర్‌కు మంచి స్పందన లభిస్తున్నదని, ఓ కొత్త కథను తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నామని నిర్మాత విజేష్ తయాల్ పేర్కొన్నారు. శివబాలాజీ, మనోహరన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సన్ని డి, సంగీతం: మోహిత్ రెహమానియక్, రచన–దర్శకత్వం: అరుణ్ విక్కిరాలా.

థ్రిల్లింగ్ కాన్సెప్ట్‌తో 'ప్లాంట్ మ్యాన్'

చంద్రశేఖర్, సోనాలి పాణిగ్రాహి జంటగా నటిస్తున్న చిత్రం 'ప్లాంట్ మ్యాన్'. కె.సంతోష్‌బాబు దర్శకుడు. పన్నా రాయల్ నిర్మాత. డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను ఇటీవల విడుదల చేశారు. ఆద్యంతం హాస్య ప్రధానంగా ట్రైలర్ ఆకట్టుకుంది. దర్శకుడు మాట్లాడుతూ 'ఫుల్‌లెంగ్త్ కామెడీ ఎంటర్‌టైనర్ ఇది. ఫ్యామిలీ మొత్తం కలిసి చూసే విధంగా ఉంటుంది. ఇప్పటివరకు ఎవరూ టచ్ చేయని కొత్త ఎలిమెంట్‌తో తెరకెక్కించాం. అందుకే 'ప్లాంట్ మ్యాన్' అనే టైటిల్ పెట్టాం. ఈ సినిమా కాన్సెప్ట్ వినోదాన్ని పంచడంతో పాటు ప్రేక్షకులను థ్రిల్‌కు గురిచేస్తుంది' అన్నారు. అశోక్ వర్ధన్, యాదం రాజు, అప్పారావు, బేబీ ప్రేక్షిత, అక్కం బాలరాజు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: పి.ఎస్.మణికర్ణన్, సంగీతం: ఆనంద బాలాజీ, నిర్మాత, దర్శకత్వ పర్యవేక్షణ,: పన్నా రాయల్.

వైష్ణవ్‌తేజ్

నేను హీరోను కాను.. నటుణ్ణి మాత్రమే

''మాస్ హీరో అవుదామని లేదు. నాకు తెలిసిందల్లా కష్టపడి నిజాయితీగా పనిచేసుకుపోవడమే. కథ, పాత్ర నచ్చితే సినిమా చేస్తాను. ఫలితం గురించి ఆలోచించను. తొలి సినిమా 'ఉప్పెన' కూడా అలాగే చేశాను. ఎవరైనా అడిగినా నేను హీరోను కాదు, నటుడ్ని మాత్రమే అని చెబుతాను. 'హీరో అనిపించుకుంటే మంచి పాత్రలు చేయలేం. నటుడు అనిపించుకో.. విభిన్నపాత్రలు చేసే అవకాశం వస్తుంది' అని పవన్‌కల్యాణ్ చెప్పారు. ఆయన మాటే నాకు వేదవాక్కు ' అని పంజా వైష్ణవ్ తేజ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'ఆదికేశవ'. శ్రీలీల కథానాయిక. శ్రీకాంత్ ఎన్.రెడ్డి దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకరులతో ముచ్చటించారు వైష్ణవ్ తేజ్.

మాస్‌కథల్లో ఇదో కొత్త జానర్

'రంగరంగ వైభవంగా' చిత్రీకరణ సమయంలో ఈ కథ విన్నాను. చాలా బాగా నచ్చింది. తుదిమెరుగులు దిద్దాక ఇంకా బాగా వచ్చింది. ఇది మాస్ సినిమా అయినప్పటికీ కథలో కొత్తదనం ఉంటుంది. ఇందులో కామెడీ, సాంగ్స్, విజువల్స్, ఫైట్స్ అన్నీ బాగుంటాయి. యాక్షన్ సన్నివేశాలు కథలో భాగంగానే ఉంటాయి. వాటిని దర్శకుడు సాధ్యమైనంత సహజంగా చిత్రీకరించాడు. కొడితే పదిమంది గాల్లో ఎగిరిపడటం లాంటివి ఇందులో ఉండవు. అన్నీ నాచురల్‌గా ఉంటాయి

రాధికగారితో నటించడం మరపురాని అనుభూతి

శ్రీలీలతో డ్యాన్స్ అంటే మాటలు కాదు. నేను స్వతహాగా డ్యాన్సర్‌ని కాదు. పట్టుదల మాత్రం ఎక్కువ. మీరు ఓకే అనేదాకా ఎంతైనా కష్టపడతాను అని మాస్టర్‌కి చెప్పాను. కానీ ఎంత కష్టమైనా మూమెంట్ అయినా రెండో టేక్‌లోనే ఓకే అయిపోయేది. శ్రీలీల కూడా బాగా కోపరేట్ చేసింది. మా ఇద్దరి మధ్య సన్నివేశాలు కూడా క్యూట్‌గా, సరదాగా, సహజంగా ఉంటాయి. శ్రీలీల పాత్రలోని అమాయకత్వం, తింగరితనంలోనుంచి దర్శకుడు శ్రీకాంత్ హాస్యం రాబట్టాడు. అలాగే సీనియర్ నటి రాధికగారితో కలిసి నటించడం మరపురాని అనుభూతి. జీవీ ప్రకాశ్‌కుమార్‌గారి పాటలు నేపథ్యం సంగీతం రెండూ అద్భుతంగా ఉంటాయి.

పోలీసు వారి హెచ్చరిక

అఖిల్ సన్నీ, అజయ్‌ఘోష్, సంజయ్ నాయర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'పోలీసు వారి హెచ్చరిక'. బాబ్జీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని బెల్లి జనార్ధన్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. దర్శకుడు మాట్లాడుతూ 'మన పిల్లల మీద ప్రదర్శించే ప్రేమలో కొంతనైనా అనాథ బాలల పట్ల ప్రదర్శించాలి. అలా చేయకపోతే వారు సంఘ వ్యతిరేక శక్తుల చేతుల్లో చిక్కుకొని సమాజాన్ని నాశనం చేసే నేరస్థులుగా మారతారు అనే సీరియస్ అంశాన్ని చర్చిస్తూ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం. సామాజిక సందేశంతో ఆకట్టుకుంటుంది' అన్నారు. డిసెంబర్ మొదటివారంలో షూటింగ్ పూర్తవుతుందని, హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుతున్నామని నిర్మాత బెల్లి జనార్ధన్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: కొండపల్లి నళినీకాంత్, సంగీతం: గజ్వేల్ వేణు, రచన–దర్శకత్వం: బాబ్జీ.

మధ్యతరగతి అనుబంధాలతో..

రాజా రవీంద్ర ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'సారంగాదరియా'. పద్మారావు అబ్బిశెట్టి దర్శకుడు. సాయిజా క్రియేషన్స్ పతాకంపై ఉమాదేవి, శరత్‌చంద్ర నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఇటీవల యువ హీరో రాజ్‌తరుణ్ విడుదల చేశారు. దర్శకుడు మట్లాడుతూ 'మధ్య తరగతి కుటుంబాల్లో ఉండే అనుబంధాలను, సంఘర్షణలను ఆవిష్కరిస్తూ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం. ఎమోషనల్ డ్రామాగా ఆకట్టుకుంటుంది' అన్నారు. త్వరలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత శరత్ చంద్ర తెలిపారు. శ్రీకాంత్ అయ్యంగార్, శివ చందు, యశ్వినీ, మెయిన్, మోహిత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ స్వయంభూ, సంగీతం: ఎమ్.ఎబెనెజర్ పాల్.

ఆ బాధ నుంచి ఈ కథ పుట్టింది

'దర్శకుడ్ని కావాలనేది నా కోరిక. ఈ విషయాన్ని 'మన్మథుడు' షూటింగ్ టైమ్‌లో నాగార్జున గారికి చెప్పాను. నీ మెంటాలిటీకి దర్శకుడు అంటే కష్టంకానీ, నిర్మాతగా ప్రయత్నించు అని నాగ్ సలహా ఇచ్చారు. నా కోరికను నిజం చేసుకుంటూ, నాగ్ సలహా పాటిస్తూ స్వీయ దర్శకత్వంలో 'మాధవే మధుసూదన' నిర్మించాను' అని చెప్పారు దర్శక,నిర్మాత బొమ్మదేవర రామచంద్రరావు. తేజ్ బొమ్మదేవర, రిషికి లొక్రే జంటగా నటించారు. ఈ నెల 24న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా బొమ్మదేవర రామచంద్రరావు విలేకరులతో మాట్లాడారు. 'సూపర్' టైమ్‌లో అనుష్కకు మేకప్ వేస్తూ, 'రేపు మీరు పెద్ద హీరోయిన్ అయ్యాక, నాకు డేట్స్ ఇవ్వాలని అడిగాను. ఇదే మాట చాలామంది హీరోయిన్లను అడిగాను. అయితే మాట నిలబెట్టుకున్న తార మాత్రం అనుష్క ఒక్కరే అని చెప్పారు. అనుకున్న బడ్జెట్‌లో సినిమా తీశానని, ఏడాదిన్నర కేవలం స్క్రిప్ట్‌కి కేటాయించానని, కావాల్సిందే రాసుకున్నానని, రాసున్నదే తీశానని ఆయన అన్నారు. 'ఓ మనిషికోసం ఎదురు చూస్తునాం. కానీ అతను రాలేదు. ఎదురు చూస్తున్న వ్యక్తి రాకపోతే ఆ బాధ వర్ణనీతం. అందులోంచి ఈ కథ పుట్టింది' అని నిర్మాత అన్నారు.